# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆర్టీజీఎస్ సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు.
2. మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఐ టీశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.
3. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'అడవితల్లి బాట' పేరుతో అభివృద్ధి చేసిన రహదారులను ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈరోజు ప్రారంభిస్తారు.
4. ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.
5. ఈ రోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పలు జిల్లాల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ మధ్యాహ్నం జరగనున్న ఈ సమావేశంలో రియల్ టైమ్ గవర్నెన్స్ -ఆర్టీజీఎస్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఆక్వా ఎగుమతుల సంఘ ప్రతినిధులతో సమావేశమై ఎగుమతి సుంకాలపై చర్చిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా 'అడవితల్లి బాట' పేరుతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చేసిన రహదారులను ప్రారంభిస్తారు. ఈ ఉదయం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ మండలం పెదపాడుకు వెళ్తారు. అక్కడి గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి బహిరంగసభలో పాల్గొంటారు. రేపు ఉదయం అరకు మండలంలోని సుంకరమిట్ట చేరుకుని పైవంతెనను ప్రారంభిస్తారు. అనంతరం విశాఖపట్నంలో పర్యావరణ హిత పర్యాటకంపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఐటీశాఖ మంత్రి నారా

లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో మూడవరోజు నిర్వహించిన 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమంలో లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

---

ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. వైయస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామాలయంలో కళ్యాణోత్సవ ఏర్పాట్లపై దేవదాయ శాఖ అధికారులతో ఆయన ఈరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ నెల 11న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నారని చెప్పారు. కాగా అంతకుముందు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రవాణా శాఖ మంత్రి ఎమ్. రాంప్రసాద్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

---

జల జీవన్ మిషన్ పథకం ద్వారా మారుమూల గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 160 కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలోని కనకాయలంక , పెదలంక గ్రామాల్లో కోటి 60 లక్షల రూపాయలతో జలజీవన్ మిషన్ పథకం కింద మంచినీటి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద నీటిని నివారించేందుకు ఏటి గట్లను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. కోటి రూపాయలతో కనకాయలంక గ్రామంలో కాజ్‌వే అప్రోచ్ వంతెన నిర్మాణం చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.

---

"ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తు" అనే ఇతివృత్తంతో ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1948 ఏప్రిల్ 7వ తేదీన ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూ. హెచ్. ఓ ఏర్పాటైంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు మెరుగైన ఆరోగ్యంతో జీవించాలన్న లక్ష్యంతో డబ్ల్యూ, హెచ్.ఓ పిలుపుమేరకు 1950 ఏప్రిల్ 7వ తేదీ నుండి ప్రతిఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది.

---

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ రోజు పలు జిల్లాల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని కొండపల్లి పురపాలక సంఘ కమిషనర్ బి.రమ్యకీర్తన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక మరోవైపు అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈ.బి.దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ .. 36 సెకన్లు

---

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో ఈరోజు 20 వేల మంది విద్యార్థులతో 108 సూర్య నమస్కారాల ప్రదర్శన జరుగుతుందని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ సాయంత్రం నాలుగు గంటల నుండి రెండు గంటల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలియచేశారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం తిరుపతి జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. జిల్లాలోని శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామంలో ఈ పథకం కింద అనేక మంది ఉపాధి లభిస్తోందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తమకు నగదును అధికారులు సకాలంలో చెల్లిస్తున్నారని లబ్ధిదారులు సరోజమ్మ పేర్కొంటూ...

వాయిస్ .. 19 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఈ రోజు ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు వార్షిక సమ్మేటివ్ అసెస్మెంట్ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి. ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తుండగా, తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల 15 నిమిషాల వరకు పరీక్షలు జరుగుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ఊపరితల ఆవర్తనం కొనసాగుతోందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఇది సముద్రమట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని, ఈ రాత్రికి దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ అల్పపీడనం ముందుగా ఆంధ్రప్రదేశ్ తీరాన్ని సమీపించి తరువాత మయన్మార్ వైపుగా ప్రయాణించ వచ్చని పేర్కొంది. దీని ప్రభావంతో ఈరోజు, రేపు రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

---------------------------

భారత్ –అమెరికా దేశాల మధ్య త్రివిధ దళాల పరస్పర సహకారం బలోపేతం దిశగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయంప్ 2025 విన్యాసాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈనెల 1 వ తేదీన మొదలైన హార్బర్ దశ విన్యాసాలు ఈరోజుతో ముగుస్తున్నాయి. అలాగే, రేపటి సముద్ర దశ విన్యాసాలు కాకినాడ తీరంలో ఈనెల 12వ తేదీ వరకు జరగనున్నాయని తూర్పు నౌకాదళ అధికారులు తెలిపారు. అలాగే ఈ నెల 13వ తేదీన విశాఖ తీరంలో యూఎస్ఎస్ కామ్ స్టాక్ యుద్ధనౌకలో ముగింపు ఉత్సవాలు జరుపుతామని అనంతరం యూఎస్ రక్షణ దళాలకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

=====================